

మరో తొమ్మిది కరోనా కేసులు

విశాఖపట్నం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కరోనా పాజిటివ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. ఆదివారం కొత్తగా తొమ్మిది మందికి వైరస్ సోకినట్టు తేలింది. బాధితుల్లో ఆరుగురు హోమ్ ఐసోలేషన్‌లో ఉండగా, ముగ్గురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇప్పటివరకు నమోదైన 28 పాజిటివ్ కేసుల్లో ప్రస్తుతం 17 యాక్టివ్ కేసులు కాగా, వీరిలో 12 మంది హోమ్ ఐసోలేషన్‌లో ఉండగా, ఐదుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైరస్ నుంచి 11 మంది కోలుకున్నారు.

కొత్త సంవత్సర వేడుకలతో హోరెత్తిన నగరం

న్యూ ఇయర్ జోష్

- స్టార్ హోటళ్లలో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- యువతతో కిక్కిరిసిన బార్లు, హోటళ్లు
- తీరంలో అంబరాన్నంటిన సంబరాలు
- మద్యం దుకాణాల ఎదుట బారులుతీరిన మందుబాబులు
- తెలుగుతల్లి ఫ్లైవోవర్ మూసివేత, బీచ్‌రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు



తీరంలో ఆకట్టుకున్న సైకత శిల్పం

విశాఖపట్నం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం అర్ధరాత్రి కొత్త సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. 2023కు వీడ్కోలు, 2024కు స్వాగతం చెబుతూ నగరవాసులంతా హంగామా చేశారు. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరు ఘనంగా వేడుకల్లో పాల్గొన్నారు. కొందరైతే వారం ముందు నుంచే కొత్త సంవత్సరం వేడుకలకు సన్నాహాలు చేసుకున్నారు. కస్టమర్ల అభిరుచుల మేరకు నగరంలో స్టార్‌హోటళ్లు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేసి, అర్ధరాత్రి 12 గంటలకు కేక్ కత్తిరించి వేడుకలు నిర్వహించాయి. సినీ, టీవీ నటులతో నిర్వహించిన కార్యక్రమాలకు భారీగా జనం హాజరయ్యారు.

కొత్త సంవత్సర వేడుకలు జరుపుకునేందుకు వచ్చిన వారితో బార్లు కిక్కిరిసిపోయాయి. మద్యం దుకాణాల ఎదుట మందు ప్రియులు బారులు తీరారు. నగరవాసులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో విశాఖ చేరుకున్న వేలాది మంది కొత్త సంవత్సర వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రమాదాలకు ఆస్కారం లేకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. తెలుగుతల్లి ఫ్లైవోవర్‌ను సాయంత్రం నుంచే మూసివేశారు. బీచ్‌రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆ రోడ్డుపై వాహనాలను రాత్రి పది గంటల తరువాత సిరిపురం జంక్షన్, పార్కుహోటల్ జంక్షన్ వద్దే నిలువరించారు. సంబరాలు జరుపుకోవాలనుకునే వారంతా అక్కడి నుంచి నడుచుకుంటూ బీచ్‌రోడ్డుకు చేరుకుని, తీరంలో కేకులు కత్తిరించి సందడి చేశారు. కాగా నూతన సంవత్సరానికి సంప్రదాయ రీతిన స్వాగతం పలికేందుకు మహిళలు ఇంటి ముందు రంగురంగుల రంగవల్లికలను తీర్చిదిద్దారు. అర్ధరాత్రి 12 గంటల సమయానికి సమీప దేవాలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



న్యూఇయర్ రంగవల్లులు



నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ బీచ్‌రోడ్డులో యువత కేరింతలు



ఆదివారం అర్ధరాత్రి సంపత్ వినాయగర్ ఆలయం వద్ద రద్దీ

పారిశుధ్య కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పారిశుధ్య సిబ్బంది ఆదివారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కారును ముట్టడించి నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన



అంగన్‌వాడీలు, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికుల సమ్మెకు ప్రజా సంఘాలు మద్దతు పలికాయి. ఈ మేరకు ఆదివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. - వార్త 9లో



అమృత భారత్ రైలుకు స్వాగతం పలుకుతున్న నగర మేయరు గొలగాని హరి వెంకటకుమారి, డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్, డాక్టర్ కూటికుప్పల సూర్యారావు

అమృత భారత్‌కు సాదర స్వాగతం

- మాల్దా, బెంగళూరు మధ్య రాకపోకలు
- విశాఖ మీదుగా తొలి పుష్ పుల్ రైలు
- 7వ తేదీ నుంచి అందుబాటులోకి

విశాఖపట్నం, డిసెంబరు 31: దిగువ, మధ్య తరగతి వర్గాలకు అత్యాధునిక సౌకర్యాలతో అందుబాటులోకి తెచ్చిన అమృత భారత్ వారాంతపు రైలు (ట్రయల్ రన్)కు ఆదివారం విశాఖ రైల్వే స్టేషన్‌లో ఘన స్వాగతం లభించింది. మధ్యాహ్నం మూడు గంటలకు చేరిన రైలుకు మేయతిజుఏ గొలగాని హరి వెంకటకుమారి, డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్, డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, జోనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. మాల్దా-ఎస్ఎంవీ బెంగళూరు మధ్య నడిచే అమృత భారత్ రైలును విశాఖ మీదుగా ప్రవేశపెట్టడంపై మేయరు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాయ్ రైడ్ సంస్థ విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు మేయర్ ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ విశాఖ మీదుగా నడిచే తొలి పుష్ పుల్ రైలు ఇదే కావడం విశేషమన్నారు. ఈ రైళ్లకు విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డుతో సహా రాష్ట్రంలో 14 హాల్టులు కల్పించామన్నారు. శుక్రవారం మాల్దాలో బయలుదేరిన ఈ రైలుకు ఆదివారం శ్రీకాకుళం రోడ్డు, విజయనగరంలో స్వాగతం పలికామన్నారు.

జనవరి ఏడు నుంచి రాకపోకలు...

ఈ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులు జనవరి ఏడు నుంచి అందుబాటులోకి రానున్నాయి. 13434 నంబరు గల రైల ప్రతి ఆదివారం ఉదయం 8.50కు మాల్దాలో బయలుదేరి సోమవారం ఉదయం 5.35కు విశాఖ, మంగళవారం తెల్లవారుజాము 3 గంటలకు ఎస్‌వీఎంటీ బెంగళూరు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 13433 నంబరు గల రైలు జనవరి తొమ్మిది నుంచి ప్రతి మంగళవారం మధ్యాహ్నం 1.50కు ఎస్‌వీఎంటీ బెంగళూరులో బయలుదేరి బుధవారం ఉదయం 10.30కు విశాఖ, గురువారం ఉదయం 11 గంటలకు మాల్దా చేరుతుంది.

వలంటీర్లకు బుజ్జగింపు!

- నెలకు అదనంగా రూ.750 చెల్లింపు
- రేషన్ సరకుల పంపిణీ పర్యవేక్షణా వారికే

విశాఖపట్నం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా రూ.ఐదువేల గౌరవ వేతనం ఇచ్చి బండెడు చాకిరీ చేయిస్తున్నారంటూ గుర్రుగా ఉన్న వలంటీర్లను ప్రభుత్వం బుజ్జగించే ప్రయత్నం చేసింది. రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించే బాధ్యతను వారికి అప్పగిస్తూ నెలకు రూ.750 అదనంగా ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం నుంచి క్లస్టర్ల వారీగా సరకుల పంపిణీని పర్యవేక్షించాలని ఆదేశించింది. రేషన్ సరకుల పంపిణీని డీలర్లను తప్పించి రెండేళ్ల క్రితం మొబైల్ డిస్పెనింగ్ యూనిట్ (ఎండీయూ)లకు ప్రభుత్వం అప్పగించింది. అప్పటినుంచి వలంటీర్లు తమ పరిధిలో కార్డుదారులను సంబంధిత ఎండీయూలతో మ్యాపింగ్ చేసి పర్యవేక్షిస్తున్నారు. అయినా పారితోషికం చిల్లిగవ్వ కూడా పెంచలేదు. ఇదిలావుండగా రాష్ట్రంలో అంగన్‌వాడీలు, పారిశుధ్య కార్మికులు, సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులు నిరసనలు చేపడుతున్న నేపథ్యంలో వలంటీర్లు తీవ్ర అసంతృప్తితో ఆందోళనకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో వారిని బుజ్జగించే చర్యలు చేపట్టింది. దగ్గరుండి ప్రతి కార్డుదారుడికీ రేషన్ సరకులు అందేలా పంపిణీని పర్యవేక్షించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేసింది. జిల్లాలో 11,962 మంది వలంటీర్లున్నారు. 642 రేషన్‌డిపోల పరిధిలో 311 ఎండీయూలు ఉన్నాయి. నగరంలో ప్రతి 100 ఇళ్లు, గ్రామీణ ప్రాంతంలో 50 ఇళ్లకు ఒక వలంటీరు ఉన్నారు. నగరంలో సగటున ఒక వలంటీరు పరిధిలో 50 నుంచి 60 మంది బియ్యం కార్డులున్నాయని అంచనా.

నగరంలో గ్యాంగ్ రేప్!?

- బాలికపై పది మంది యువకులు అత్యాచారం

- వివరాలు మెయిన్ 2లో

ఎక్కడి చెత్త అక్కడే

మున్సిపల్ కార్మికులు సమ్మెలో ఉండడంతో ఎక్కడి కక్కడే చెత్త పేరుకుపోతోంది. ఆరు రోజులుగా వ్యర్థాలు నిల్వ ఉండడంతో విపరీతమైన దుర్గంధం వెలువడు తోంది. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కరోనా కేసులు ఎక్కువ సంఖ్యలో నమోదవుతుండడం, రోజుల తరబడి చెత్త నిల్వ ఉండడంతో ఎప్పుడు ఏ రోగం బారిన పడతామోనని భయపడుతున్నారు. అందుకు ఈ చిత్రాలే నిదర్శనం.

- మధురవాడ/ఎంవీపీ కాలనీ/వెంకోజీపాలెం


ఎంవీపీ కాలనీలోని వీధుల్లో దుస్థితి


పాత వెంకోజీపాలెంలోని చెన్నకేశవ అపార్టుమెంట్ వద్ద చెత్తతో నిండిన కల్వర్టు


మధురవాడ పీహెచ్‌సీ వద్ద చెత్త


నగరంపాలెం రోడ్డులో పేరుకుపోయిన చెత్త


మధురవాడ మార్కెట్ వద్ద చెత్త పోగులు

సినిమా గైడ్

- **డెవిల్ :** జగదాంబ, వెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **బబుల్ గమ్ :** శరత్, రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **సలార్ :** మెలోడి, సంగం, శారద, శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత(శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **పిండం :** మోహిని (గాజువాక)
- **ఆక్వామెన్ :** సుకన్య(గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **హాయ్ నాన్న :** మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), గణేష్ (తగరపువలస),

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 24, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 62, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 54, బీరకాయలు 58, ఆనపకాయలు 32, కాలీఫ్లవర్ 28, క్యాబేజ్ 20, క్యారెట్ 40, దొండకాయలు 52, బంగాళా దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 84, అల్లం (పాతది) 100, బరబటి 52, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 50, గోరుచిక్కుడు 44, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 220, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 44 , ఆగాకర 84, పొటల్స్ 54, కీరదోస 24, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 15, చేమదుంపలు 54, చిలగడదుంపలు 24 , కంద 50, దేముడు చిక్కుడు 60, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, క్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	100
ఫారం ధర	--	120
విత్ స్కిన్	--	210
స్కిన్‌లెస్	--	220

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 9 లో..

బాలకృష్ణుడిగా అప్పన్న దర్శనం


బాలకృష్ణుడి అలంకరణలో స్వామివారు

సింహాచలం, డిసెంబరు 31 : వరాహలక్ష్మీనృసింహ స్వామి సన్నిధిలో గత నెల 23 నుంచి జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా స్వామివారు భక్తులకు ఆదివారం పారాడే కణ్ణన్‌గా దర్శనమిచ్చారు. మధ్యాహ్నం పవళింపు సేవ అనంతరం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శిఖలో నెలమలి పించంతో, వెన్న కడవ వద్ద ఉండి కుడి చేతిలో వెన్నముద్దతో పారాడే (పాకురుతున్న) కణ్ణన్ (కృష్ణుడు)గా ఆలయ అలంకారి కరి సీతారామాచార్యులు స్వర్ణాభరణాలతో తీర్చిదిద్దిన తీరు భక్తులను మంత్రముగ్ధులను చేసింది. ప్రత్యేక పల్లకిలో బాలకృష్ణుడ్ని ఉంచి మరో పల్లకిలో ఇద్దరు దేవేరులను, నలుగురు ఆళ్వార్లను ఉంచి తొలుత ఆలయ బేడా మండపంలో తిరువీధి జరిపారు.తరువాత ఉత్తరరాజగోపురం నుంచి బయటకు వచ్చి ఆలయ ప్రధాన మాడవీధుల్లో తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్, ఇన్‌చార్జి హవల్దార్ గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పర్యవేక్షణాధికారి పిళ్లా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో తిరుప్పావై పాశుర విన్నపం

వరాహలక్ష్మీనృసింహస్వామి అనుబంధ దేవాలయం పద్మావతి, అలివేలుమంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు సంప్రదాయబద్ధంగా జరుతున్నాయి. ఆదివారం ఉదయం సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపిన తరువాత ప్రభాతారాధనలు, నిత్య హోమాలు, సేవాకాలం నిర్వహించారు. అండాళ్ రచించిన తిరుప్పావైలోని 15వ పాశురాన్ని ఆలయ అర్చకులు పాల్గొన్న భక్తులతో కలిసి విన్నపం చేశారు. అనంతరం అర్చకులు తీర్థగోష్ఠి జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కళలను బతికిద్దాం

▸▸ కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ రమణమూర్తి


అతిథులను సత్కరిస్తున్న మారుతీప్రసాద్, తదితరులు

మధురవాడ, డిసెంబరు 31 : అంతరించిపోతున్న కళలకు జీవం పోయాలని కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పీవీ రమణమూర్తి అన్నారు. మధురవాడ శిల్పారామంలో ఆదివారం ఉత్తరాంధ్ర పౌరాణిక పద్య నాటక కళాకారుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో పద్య నాటక పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అంతరించిపోతున్న కళలకు జీవం పోయాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. ముఖ్యంగా కొన్ని మాధ్యమాల వల్ల పద్య నాటకాలకు ఆదరణ తగ్గుతుందని, వాటికి పునరజ్జీవనం కల్పించడానికి కళాకారుల సంఘాలు నడుం బిగించాలన్నారు. శ్రీమాతా రికార్డింగ్ అధి నేతలు పల్లి నాగభూషణరావు, బీఎస్ మూర్తి, ప్రముఖ పాత్రికేయుడు డేవిడ్‌రాజు, డాక్టర్ రమణమూర్తి దంపతులను, నక్షత్రక పాత్రధారి అల్లాడ వెంకటరావును నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పద్య నాటక కళాకారుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములునాయుడు, కార్యదర్శి మారుతీప్రసాద్, వీఎంఆర్‌డీఏ డిప్యూటీ డైరక్టర్ కె. వెంకటేశ్వరరావు, జడ్జీలు శివప్రసాద్, రాము పాల్గొన్నారు.

వంశీని కలిసిన టీడీపీ నాయకులు

మద్దిలపాలెం, డిసెంబరు 31 : ఎమ్మెల్సీ వంశీకృష్ణశ్రీనివాస్‌ను శివాజీపాలెంలోని ఆయన నివాసంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ, 22వ వార్డు నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వారు వార్డులో టీడీపీ, జనసేన చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓటమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు, డొక్కర శ్రీను, పడాల డేవిడ్, పైడిరాజు, అప్పారావు, దేవర రఘు, గుణలక్ష్మీ, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు

సాగర్‌నగర్, డిసెంబరు 31 : బీచ్‌రోడ్డులోని రాడిసన్ బ్లూ హోటల్ వద్ద ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో భీమునిపట్నం నుంచి నగరానికి వెళ్తున్న కారు చెట్టును ఢీకొంది. దీంతో ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ప్రమాద సమయంలో కారులో నలుగురు వ్యక్తులు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. కారులోని సెఫ్టీ బెలూన్స్ తెరుచుకోవడంతో పాటు చెట్టు పరిసర ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా నాలుగు నెలలు కిందట ఇదే ప్రాంతంలో కారు ప్రమాదం జరగడంతో నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. మళ్లీ అదే చోట ప్రమాదం జరగడంతో స్థానికులు భయపడుతున్నారు.

వీఎఫ్‌ఎన్‌సీసీలో న్యూ ఇయర్ వేడుకలు


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వెంకటరెడ్డి

భీమునిపట్నం, డిసెంబరు 31 : తిమ్మాపురంలో వున్న వైజాగ్ ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్‌లో న్యూ ఇయర్ వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి.క్లబ్ మేనేజిమెంట్ కమిటీ ఛైర్మన్ కాయల వెంకటరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాత్రి 7 గంటలకు ప్రారంభమైన వేడుకలు అర్థరాత్రి 12 గంటల వరకూ ఉత్సాహంగా సాగాయి. జబర్దస్త్ అప్పారావు దంపతులు, గెడ్డం నవీన్ బృందం తమదైన హాస్య భరితమైన జోక్స్‌తో సభికులను కడుపుబ్బ నవ్వించారు. అలాగే ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఉర్రూతలూగించాయి. అనంతరం ఛైర్మన్ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో వీఎఫ్‌ఎన్‌సీసీని నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వీఎఫ్‌ఎన్‌సీసీ మేనేజిమెంట్ కమిటీ మెంబరు ఎంఎస్ ఎన్ రాజు, అడ్మినిస్ట్రేటివ్ కమిటీ ఛైర్మన్ కంటిపూడి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గత ఏడాది 98 గంజాయి కేసులు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 31 : గత ఏడాది టాస్క్‌ఫోర్స్ పోలీసులు 98 గంజాయి కేసులు నమోదు చేయడంతో పాటు 250 మంది స్మగ్లర్లను అరెస్టు చేసినట్టు ఏసీపీ త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 48.52 లక్షల విలువైన 2,426 కిలోల గంజాయి, రూ. 9.50 లక్షలు విలువ చేసే 19 కిలోల గంజాయి ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. రూ. 63,290 వేల నగదు కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు అడ్డగింత

తగరపువలస, డిసెంబరు 31 : చిట్టివలస రామాలయం సమీపంలోని ప్రభుత్వ భూమిలో చేపడుతున్న రోడ్డు పనులను స్థానికులు ఆదివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారి నిర్మాణం వల్ల ఎవరికీ ఎలాంటి ప్రయోజనం లేదని, కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లబ్ధి చేకూర్చడానికే పనులు చేపడుతున్నారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ పనులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

వైసీపీ వార్డు, మండల కార్యవర్గాలు ఏర్పాటు

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 31 : భీమిలి నియోజకవర్గంలోని మండలాలు, వార్డులకు కార్యవర్గాలను ఏర్పాటు చేస్తూ వైసీపీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి కమిటీకి 21 మందిని నియమించారు. భీమిలి రూరల్ మండలానికి అధ్యక్షుడినిగా జి. శ్రీను (సింగనబంద), ప్రధాన కార్యదర్శిగా బొడ్డు దుర్గారావు, కోశాధికారిగా తుపాకుల అప్పలస్వామి నియామితులయ్యారు.ఆనందపురం మండలానికి బంక సత్యనారాయణ (జగన్నాథపురం) అధ్యక్షుడిగా, కె. శ్రీను ప్రధాన కార్యదర్శిగా, సినగం రామారావు కోశాధికారిగా ఎన్నికయ్యారు. పద్మనాభం మండలానికి కె. లక్ష్మణరావు (కోరాడ) అధ్యక్షుడిగా, ఎస్. ఆదినారాయణ ప్రధాన కార్యదర్శిగా, బి. సన్యాసినాయుడు కోశాధికారిగా నియామితులయ్యారు. అలాగే 1వ వార్డు అధ్యక్షుడిగా జె.ప్రసాద్ (తగరపువలస) యు. నాగేశ్వరరావు ప్రధాన కార్యదర్శిగా, బి. సాయి కోశాధికారిగా ఎన్నికయ్యారు. 2వ వార్డు అధ్యక్షుడిగా సీహెచ్ భాస్కరరెడ్డి (చిల్లపేట), సీహెచ్ వెంకటేష్ ప్రధాన కార్యదర్శిగా, పి. రాము కోశాధికారిగా నియామితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సీసీ రోడ్ల పనులు పరిశీలన

సింహాచలం, డిసెంబరు 31 : జీవీఎంసీ 98వ వార్డులోని సాయినగర్‌లో రూ.17.2 లక్షల జీవీఎంసీ సాధారణ నిధులతో జరుగుతున్న సీసీ రోడ్ల పనులను వార్డు కార్పొరేటర్ నరసింహం ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలం నిలిచి ఉండేలా నాణ్యతా ప్రమాణాలతో పనులను చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయనతో పాటు టీడీపీ వార్డు అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

సమ్మె విచ్ఛిన్నానికి అధికారుల కుట్ర

» సీఐటీయూ భీమిలి డివిజన్ నాయకుడు మూర్తి

భీమునిపట్నం, డిసెంబరు 31 : పారిశుధ్య కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి అధికారులు కుట్ర చేస్తున్నారని సీఐటీయూ భీమిలి డివిజన్ నాయకుడు ఆర్ఎస్ఎన్ మూర్తి ఆరోపించారు. ఆదివారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు.రెల్లివీధిలో మస్తర్ పాయింట్ వద్ద ఉన్న పారిశుధ్య వాహనాలను వేరే డ్రైవర్లతో తరలించడానికి అధికారులు విఫలయత్నం చేసారన్నారు. నగరంలో చెత్త ఎత్తే వాహనాలను తెల్లవారుజామునే రప్పించి నాలుగు వార్డుల్లో ఉన్న చెత్తను ఆయా వాహనాల్లో తరలించడానికి ప్రయత్నించడం దారుణమన్నారు. ఏడాదిగా వివిధ రూపాల్లో నిరసన తెలియజేసిన కార్మికులు గత్యంతరం లేక సమ్మెకు దిగితే అధికారులు వారికి అన్యాయం చేయాలని చూడడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించే వరకూ సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఆయనతో పాటు కార్మికుల సంఘం నాయకులు జలగడుగుల సురేష్, సన్నీ, శ్రీను, బొడ్డు రాజు ఉన్నారు.



కొమ్మాదిలోని దీక్షా శిబిరంలో కూర్చున్న టీడీపీ నాయకులు

టీడీపీ నాయకుల సంఘీభావం

కొమ్మాది : పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీడీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు అన్నారు. ఆదివారం ఆరో వార్డు పీఎం పాలెం కాలనీలో మున్సిపల్ కార్మికుల చేపట్టిన నిరసన దీక్షలో ఆయన పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు రోజులుగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ విశాఖపట్నం పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు గిరి గురునాథ్, వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు, రెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. కాగా కాగా ప్రైవేటు కార్మికులతో ప్రభుత్వం చేయిస్తున్న పారిశుధ్య పనులను సమ్మెలో ఉన్న కార్మికులు అడ్డుకోవడంతో పీఎం పాలెం పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.



ఓటరు నమోదు తప్పనిసరి



ఓటు నమోదు శిబిరం వద్ద సందీప్, తదితరులు

మధురవాడ/కొమ్మాది, డిసెంబరు 31 : జీవీఎంసీ ఏడో వార్డు మిథిలాపురి వుడా కాలనీలో ఆదివారం జనసేన పార్టీ వార్డు అధ్యక్షుడు నాగోతి నరసింహనాయుడు ఆధ్వర్యంలో ఓటు నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రతి ఓటూ కీలకమన్నారు. 18 ఏళ్లు నిండిన వారు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు.యువత ముందుకు వచ్చి జాబితాల్లో తమ ఓట్లు పరిశీలించుకోవాలని, ఓటు లేనివారు వెంటనే ఓటు నమోదు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగోతి నరసింహనాయుడు,బీవీ కృష్ణయ్య, జగుపల్లి నాని, పోతిన సాయి, రమేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే పీఎం పాలెం రెండవ బస్టాప్ వద్ద 6వ వార్డు జనసేన అధ్యక్షుడు సంతోష్‌నాయుడు ఆధ్వర్యంలోనూ ఓటరు నమోదు చేపట్టారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, డిసెంబరు 31 : వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠంపజేశారు. భక్తుల గోత్రనామాలతో అర్చకులు సంకల్పించి విశ్వక్సేనారాధన,పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నృసింహ అష్టోత్తర శత నామావళి (108) పఠిస్తూ ప్రతి నామానికి ఒకటి చొప్పున స్వర్ణ పుష్పంతో అర్చన చేశారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో స్వామివారి నిత్య కల్యాణం నిర్వహించారు.మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

14న గోదా రంగనాథుల కల్యాణం

వరాహలక్ష్మీనృసింహస్వామి కొండదిగువ పూదోటలో కొలువై ఉన్న పద్మావతి, అలిమంగా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల ముగింపు పురస్కరించుకుని ఈనెల 14న గోదా రంగనాథుల కల్యాణం నిర్వహించనున్నట్టు ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి తెలిపారు. కల్యాణంలో పాల్గొనే భక్తులు సోమవారం నుంచి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో రూ.1000 చెల్లించి టికెట్లు కొనుగోలు చేసుకోవచ్చునని చెప్పారు. అలాగే నృసింహస్వామి ఆవిర్భా నక్షత్రం పురస్కరించుకుని ఈనెల 6న అప్పన్న సన్నిధిలో ఉదయం 7 గంటల రెండు గంటల పాటు స్వాతి నక్షత్ర హవనం జరుగుతుందన్నారు.



'ఉద్యోగులకు 1న జీతావ్వాలి'

పద్మనాభం (రూరల్), డిసెంబరు 31 : ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలివ్వాలని యూటీఎఫ్ జిల్లా ప్రతినిధి ఉప్పాడ రాము డిమాండ్ చేశారు. ఆదివారం అయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ప్రతి నెలా 17వ తేదీ వచ్చినా జీతాలు వేయడం లేదని, దీనివల్ల ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఉద్యోగులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ సరెండర్ లీవ్ చెల్లింపులు కూడా జరగడం లేదన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈనెల 3న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి విజయవంతం చేయాలని కోరారు.















గ్యాస్ లబ్ధిదారులకు ఈకేవైసీ

అక్కయ్యపాలెం, డిసెంబరు 31: వంట గ్యాస్ లబ్ధిదారులు ఈకేవైసీ చేసేందుకు గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాల ఎదుట బారులు తీరుతున్నారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ వారి సెల్ ఫోన్ల ద్వారా ఐరీస్ తీసి ఈకేవైసీ చేస్తున్నారు. ఒక్కసారి సర్వర్ డౌన్ కావడంతో ఈకేవైసీ కాక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఈకేవైసీ చేసుకోవడానికి సుమారు నాలుగు నెలలు సమయం ఉందని గ్యాస్ డెలివరీ బాయ్స్ చెబుతున్నా కొందరు ఆతృత పడుతున్నారు. గ్యాస్ సిలిండర్ల లబ్ధిదారులు చనిపోవడం, వేరే ప్రాంతాలకు షిఫ్ట్ వంటివి జరిగాయి. ఈనేపథ్యంలో అప్‌డేట్‌కు ఈకేవైసీ చేస్తున్నారు.

జిల్లా వాసులకు కలెక్టర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు

మహారాణిపేట, డిసెంబరు 31: 2024 నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో హాయిగా జీవించాలని కలెక్టర్ ఏ మల్లికార్జున ఓ ప్రకటనలో ఆకాంక్షించారు. కొత్త ఏడాదిలో లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని చేరుకోవాలని కోవాలంటూ జిల్లా వాసులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

డిమాండ్లు పరిష్కరించే వరకూ సమ్మె ఆగదు

» కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల హెచ్చరిక


సూయాజ్‌ఫాం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 31 : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేకుంటే సమ్మె విరమించేది లేదని జీవీఎంసీ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు హెచ్చరించారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె ఆదివారానికి ఆరో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా వారు తెల్లవారుజామున నుంచి తాటిచెట్లపాలెం 80 అడుగుల రోడ్డులోని సూయాజ్‌ఫాం ఎదుట ధర్నా నిర్వహించారు. అలాగే సూయాజ్‌ఫాంలోని చెత్త తరలించే వాహనాలు బయటకు రాకుండా అడ్డుకుని బైఠాయించారు. సమ్మెతో పలు వార్డుల్లో చెత్త పేరుకుపోయి రోడ్లపై చిందరవందరగా ఉంది.

ఆటో డ్రైవర్లకు జీవనభృతి ఇవ్వాలి

» ఏఐటీయూసీ రాష్ట్ర నేత వామనమూర్తి



నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

అక్కయ్యపాలెం, డిసెంబరు 31: ఆటో డ్రైవర్లకు జీవనభృతి కల్పించాలని ఏఐ టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. రైల్వేస్టేషన్ ఇండియా జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్స్ ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, జనవరి 1వ తేదీ నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించితే, ఆటో కార్మికులు జీవనోపాధి కోల్పోతారని అయన ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా పెంచిన డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ జీవో నెంబర్లు 21, 31 రద్దు చేయాలన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి రాష్ట్రవ్యాప్తంగా 6 లక్షల 81 వేల ఆటో, క్యాబ్ డ్రైవర్ల అదాయాన్ని గండి కొట్టాలని భావిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. రావికృష్ణ, వై.వెంకట్, హెచ్. శేఖర్, కె.నూకరాజు, బి.జగన్నాథం, పి.శంకరరావు, వై.నాగరాజు, పి.రమేష్ పాల్గొన్నారు.

వంశీని కలిసిన టీడీపీ నాయకులు


వంశీకృష్ణ శ్రీనివాస్‌కు పూలబొకేలు అందిస్తున్న టీడీపీ నాయకులు

మద్దిలపాలెం, డిసెంబరు 31 : శివాజీపాలెంలో ఎమ్మెల్సీ వంశీకృష్ణశ్రీనివాస్‌ను ఆయన నివాసంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ, 22వ వార్డు నాయకులు ఆది వారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వారు వార్డులో టీడీపీ, జనసేన చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు, డొక్కర శ్రీను, పడాల డేవిడ్, పైడిరాజు, అప్పారావు, దేవర రఘు, గుణలక్ష్మి, జయమ్మ పాల్గొన్నారు. అలాగే జనసేన పార్టీ 21వ వార్డు అధ్యక్షురాలు గుమ్మడి నందితారావు కూడా వంశీకృష్ణను కలిసి, ఘనంగా సత్కరించారు.

రాజకీయాల్లో ప్రభుత్వ ఉద్యోగులు కీలకమే..

ఎంవీపీ కాలనీ : రాజకీయాల్లో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర చాలా కీలకమని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శివాజీపార్కులో శనివారం యాదవ ఎంప్లాయిస్ సొసైటీ నిర్వహించిన వన భోజనాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ఇబ్బంది పడితే ప్రభుత్వాలు మారిపోయే పరిస్థితి ఉంటుందన్నారు. యాదవ సంఘం నేతలు పాల్గొన్నారు.

'గత ఏడాది 98 గంజాయి కేసులు'

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 31 : గత ఏడాది టాస్క్‌ఫోర్స్ పోలీసులు 98 గంజాయి కేసులను నమోదు చేయడంతో పాటు 250 మంది స్మగ్లర్లను అరెస్టు చేసినట్టు ఏసీపీ త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 48.52 లక్షల విలువైన 2,426 కిలోల గంజాయి, రూ. 9.50 లక్షలు విలువ చేసే 19 కిలోల గంజాయి ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. రూ.63,290నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే మత్తు మందుల విక్రయాలు, రవాణాపై 9 కేసుల్లో 26 మందిని అరెస్టు చేశామని, 70 కేసుల్లో 565 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసి, రూ.50.36 లక్షలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. క్రికెట్ బెట్టింగ్‌పై 5 కేసుల్లో 28 మంది బుకీలను అరెస్టు చేశామన్నారు.

కనకమహాలక్ష్మికి స్వరూపానందేంద్ర సరస్వతి పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

జగదాంబ కూడలి, డిసెంబరు 31: మార్గశిర మాసోత్సవాలను పురస్కరించుకొని కనకమహాలక్ష్మి అమ్మవారిని శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామి దర్శించుకున్నారు. ఆదివారం వేదసభలో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయనకు ఈవో కె.శిరీష, అర్చకులు పూర్ణాకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు.

వేదసభలో పండితులు చర్చాగోష్టి

మార్గ శిర మాసోత్సవాల్లో భాగంగా ఆలయ ఆవరణలో వేద సభ, అర్చక సదస్సు ఆహ్లాదవాతావరణంలో సాగింది. ఈ సభలో 25 మంది వేదపండితులు, 25 మంది అర్చకులు పాల్గొన్నారు. చతుర్వేదాల విశిష్టత, వైఖానస, స్మార్తం, శైవాగమం, పాంచరాత్రం, ఆగమంలలోని అంశాలను పండితులు వివరించారు. చర్చ కొనసాగింది. దేవస్థానం వేదపండితులు భీమశంకర శాస్త్రి, వెంకటేశ్వర ఘనాపాఠి, దావలి లక్ష్మీనారాయణ అవధానులు, పంచముఖశర్మ, ఉప అర్చకుడు శ్రీనివాస శర్మ. అర్చకుడు బీఎస్ఎస్ భట్టర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మురళీనగర్, డిసెంబరు 31; మురళీనగర్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. క్లబ్ కళా వేదికపై ఉదయం 6 గంటల నుంచి గుండె వైద్య నిపుణులు డాక్టర్ టి.రవికాంత్ రోగులను పరీక్షించారు. రోగులకు ఆహార విషయంలో తీసుకోవాల్సిన నియమాలను సూచించారు. అతిగా నూనె వంటకాలకు దూరంగా ఉండటం, నిత్య వ్యాయామం అవసరమని సూచించారు. నాడీ వ్యవస్థ వైద్య నిపుణులు ఆర్.పవన్ కుమార్ రోగులకు వైద్య పరీక్షలు చేశారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి ఏర్పాట్లు చేశారు. క్లబ్ ఉపాధ్యక్షులు ఎ.రామకృష్ణ, పూర్వ అధ్యక్షుడు బుచ్చయ్య చౌదరి సహకరించారు. వైద్యులను సత్కరించి జ్ఞాపికలు అందించారు.

అన్ని మతాలవారికి తీర్థ యాత్రలకు అవకాశం

» టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్

మహారాణిపేట, డిసెంబరు 31: క్రిస్టియన్లను జెరూసెలుంనకు, పేద హిందువులను కాశీ యాత్రకు తన సొంత నిధులతో పం పించనున్నట్టు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అన్నారు. ఏటా తన సొంత నిధులతో పేద ముస్లింలను మక్కా యాత్రకు పంపిస్తున్నానని, అదేవిధంగా ఈ ఏడాది అన్ని మతాలకు చెందిన పేదలను వారివారి పుణ్యతీర్థ యా త్రలకు పంపించాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు.

ఇళ్ల పట్టాల మంజూరుకు కృషి చేయరూ..


కేకే రాజుతో మాట్లాడుతున్న లబ్ధిదారులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 31 : గ్రేటర్ 45వ వార్డు తాటిచెట్లపాలెం రజకుల కాలనీలో నిర్మించిన ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేసి పట్టాలివ్వాలని లబ్ధిదారులు రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజును కోరారు. ఆప్రాంతంలో ఆదివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజకుల కాలనీలో గత 15 ఏళ్ల క్రితం సుమారు 150 ఇళ్లు నిర్మించి స్థానికులకు ఇచ్చారు. వాటికి వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పేరిట 25 మందితో డబ్బులు కట్టించుకున్నా, ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ పట్టాలు ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ సంక్రాంతిలోగా పట్టాలు అందజేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపా హనుక్, వైసీపీ అధ్యక్షుడు పైడి రమణ, హరి పట్నాయక్, యాదవ రాజు, బాబూరావు, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ పోటీలు


బెల్ట్ సాధించిన చిన్నారులతో అతిథులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), డిసెంబరు 31: వాడో కాయ్ కరాటే అసోసియేషన్ నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష పోటీలు ఆదివారం ముగిశాయి. అక్కయ్యపాలెం జీవీఎంసీ స్కూల్‌లో మాస్టర్ కిశోర్ వద్ద ఆరు నెలలుగా శిక్షణ పొందిన సుమారు 60 మంది చిన్నారులు పాల్గొని ప్రతిభ చూపి బెల్ట్‌లు సాధించారు. ఆదివారం జనసేన నాయకులు బొడ్డేపల్లి రఘు ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులకు బెల్ట్‌లు ప్రదానం చేసి అభినందించారు. కార్పొరేటర్ ముక్క శ్రావణి, టీడీపీ నాయకులు కిశోర్, చీఫ్ ఎగ్జామినర్ చిగురుపల్లి సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ సంయుక్త విజేతలు శబరి స్పోర్టింగ్, టీసీఎఫ్ఏ

మిసెస్ ఏవీఎన్ కాలేజీ గ్రౌండ్‌లో జరిగిన బీఎల్.రావు స్మారక వెటరన్ ఫుట్‌బాల్ టోర్నీలో శబరి స్పోర్టింగ్ క్లబ్, టీకోర్టు ఫుట్‌బాల్ అసోసియేషన్ (టీసీఎఫ్ఏ) సంయుక్త విజేతలుగా నిలిచాయి. ఆదివారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో శబరి, టీసీఎఫ్ఏ జట్లు చెరో గోలు చేయడంతో డ్రా అయింది. దీంతో నిర్వాహకులు పాయింట్ల పట్టికలో ఇరు జట్లను సంయుక్త విజేతలుగా ప్రకటించారు. కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు. నిర్వాహకులు వి.భాస్కర్, బి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్

రైల్వే అథ్లెటిక్స్ గ్రౌండ్‌లో విశాఖపట్నం అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన జూనియర్ బాలుర బాలికల జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ ఆదివారం ముగిసింది. జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు డి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఎంవీ.పవన్ కార్తీక్, ప్రధాన కార్యదర్శి ఎం.నారాయణరావు, ఇంటర్నేషనల్ అథ్లెట్ హెచ్‌ఎం.జ్యోతి, మాజీ ఒలింపియన్ ఎంవీ మాణిక్యాలు తదితరులు పాల్గొని విజేతలకు పతకాలు అందజేశారు. అథ్లెటిక్స్ సంఘం ప్రతినిధులు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. అండర్-14 బాలుర విభాగంలో కే జతిరామ్, బాలికల విభాగంలో బి.ప్రవల్లిక రెడ్డి..అండర్-16 బాలురలో సీహెచ్.కిరణ్ సాయి, బాలికల్లో పి.శైలజ విజేతలుగా నిలిచారు.

రానున్న ఎన్నికల్లో గొప్ప మార్పు రావాలి

» ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు

మాధవధార, డిసెంబరు 31 ; రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో గొప్ప మార్పు రావాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్సీ దువ్వారపు.రామారావు ఆకాక్షించారు. మాధవధార ఉడాకాలనీలోని ఎమ్మెల్సీ నివాసంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశాఖ బీసీ కులాల సమాఖ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో సంఘం అధ్యక్షులు గెడ్డప్ప, ప్రధాన కార్యదర్శి వి.నూకరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.మధుసూదనరావు, ఎ.కిశోర్‌కుమార్, ఎన్.కనకమహాలక్ష్మి, రాజులమ్మ తదిరతులు పాల్గొని ఎమ్మెల్సీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో టీడీపీ విజయ యా త్ర కొనసాగించాలని బీసీ సంఘం నాయకులు ఆకాక్షించారు.


ఎమ్మెల్సీ నివాసంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో నేతలు

సీతారామ సేవా సంఘం పిక్నిక్

వెంకోజీపాలెం, డిసెంబరు 31 : జీవీఎంసీ 15వ వార్డు శివాజీ పార్కులో ఆదివారం సీతారామ సేవా సంఘం వనసమారాధన జరిగింది. పెద్దల నుంచి చిన్నారుల వరకూ ఆట, పాటలతో సందడిగా గడిపారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, సీతారామ సేవాసంఘం అధ్యక్షుడు భీమరశెట్టి విశ్వనాథం, ఉపాధ్యక్షుడు వెలగా వెంకటరావు, కాళ్ల అప్పలరాజు, ఎ. శివప్రకాష్, శరగడం సుధాకర్, ఎ. రమణ, కె. రఘు, ఆర్. సురేష్ పాల్గొన్నారు.

7న బీజేపీ బీసీ సామాజిక చైతన్య సభ

- ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపి శ్రీనివాస్



సమావేశంలో శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, మాధవ్, తదితరులు

పెదవాల్తేరు, డిసెంబరు 31 : వైసీపీ ప్రభుత్వం బీసీ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 7న ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా కళాశాల మైదానంలో బీసీ సామాజిక చైతన్య సభ నిర్వహించనున్నట్టు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేసిందన్నారు. ఎన్నికల్లో ఎన్నో హామీలిచ్చి వాటిని తుంగలో తొక్కారని విమర్శించారు. జీరో బీసీ బడ్జెట్‌తో పాలన చేసిన ఏకైక ప్రభుత్వం వైసీపీ అన్నారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా ఒక్క కార్పొరేషన్‌కు కూడా నిధులు ఇవ్వకుండా బీసీ సమాజాన్ని అవమానించారన్నారు. రాయితీ రుణాలు నిలిపివేసి, బీసీ విద్యార్థులకు విదేశీ విద్య రుణాలు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. ఈ నేపథ్యంలో బీసీ విద్యార్థుల్ని, యువతను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకే బీసీ సామాజిక చైతన్య సభ నిర్వహి స్తున్నామని చెప్పారు. అనంతరం బీసీ చైతన్య సభ పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఆయనతో పాటు బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లి శ్రీనివాస్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కందుల నాగరాజుకు బెస్ట్ గవర్నర్ అవార్డు

అల్లిపురం, డిసెంబరు 31: దక్షిణ నియోజకవర్గం జనసేన నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజుకు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ 2023కు ఫస్ట్ బెస్ట్ గవర్నర్ అవార్డు లభించింది. వాసవిక్లబ్ డిస్ట్రిక్ గవర్నర్‌గా, సామాజిక సేవకుడి, రాజకీయ నేతగా ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఆదివారం నగరంలోని హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు.

'లేపాక్షి' వద్ద ఆక్రమణల తొలగింపు

జగదాంబ కూడలి, డిసెంబరు 31: గ్రేటర్ 30వ వార్డు లేపాక్షి దరి కుమ్మరవీధి మార్గంలో ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ఈ రహదారిని చిరువ్యాపారులు ఆక్రమించడంతో వాహనదారులు ఎదుర్కొంటున్నారు. సంక్రాంతి సందర్భంగా ఇక్కడి రోడ్డుపై మంచాలు వేసి వ్యాపారాలు జరుపుతున్నారు. దీనిపై ట్రాఫిక్ పోలీసులు గతంలో హెచ్చరించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ జోక్యం చేసుకుని వ్యాపారాలు సాగేలా పోలీసు ఉన్నతాధికారుతో మాట్లాడారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కుమ్మరవీధి వెళ్లేమార్గం పూర్తిగా చిరువ్యాపారాలతోనిండి పోయింది. వీధిలోని నివాసితులు వెళ్లేందుకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. కుమ్మరవీధిని అనుకొని ప్రధాన రహదారిలో షాపులు నిర్వహిస్తున్న రెడీమేడ్ వస్త్రవ్యాపారులు రోడ్డుపై బల్లలువేసి వ్యాపారాలు సాగిస్తున్నారు.దీనికి తోడు ఆటోలు నిలిపి ఇక్కడి వ్యాపారులు బండిల్స్‌ను అన్‌లోడింగ్ చేస్తుండడంతో సమస్య తీవ్రంగా ఉంది. దీంతో ట్రాఫిక్ ఎస్‌ఐ ప్రతాప్ ఈ రోడ్డు లో ఆక్రమణలను తొలగించారు. రోడ్డు మీద బల్లలు, మంచాలపై వస్త్రాలను తొలగించారు. ఇకనుంచి రోడ్డు ఆక్రమిస్తే సహించేదిలేదని ఎస్‌ఐ హెచ్చరించారు.

సచివాలయ ఉద్యోగుల 'నూతన' వేడుకలు

అల్లిపురం, డిసెంబరు 31: గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ మేరకు జీవీఎంసీ ఎంప్లాయిస్ గౌరవ అధ్యక్షుడు ఆనందరావు కేక్‌కట్ చేసి సంబరాలు చేశారు. కార్యక్రమంలో సచివాలయం ఎంప్లాయిస్ ఫెడరేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ పీవీ కిరణ్ కుమార్, విశాఖ జిల్లా ప్రెసిడెంట్ పిజె గణేష్ కుమార్, జిల్లా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ బివి అశోక్ కుమార్ పాల్గొన్నారు.


వివిధ రకాల పుష్పాల నడుమ వేంకటేశ్వరస్వామి

శ్రీవారికి లక్ష చామంతులతో పుష్పార్చన

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 31: బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల వేంకటేశ్వర వినాయకస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీవారికి అర్చకులు లక్ష చామంతులతో పుష్పార్చన చేశారు. కన్నులపండువగా సాగిన పుష్పార్చన భక్తులను పరవశులను చేసింది. ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మణాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు ముందుగా స్వామివారిని పంచామృతాలతో అభిషేకించాక ప్రత్యేక పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం వేదపండితులు భక్తులచే లక్ష చామంతులతో పుష్పార్చన చేయించి, ప్రత్యేక పూజలు చేశారు.

పూజాది కార్యక్రమాల్లో దేవస్థానం పాలక మండలి చైర్మన్ గంరెడ్డి రామునాయుడు, సభ్యులతో పాటు బీహెచ్‌పీవీ, మింది, అక్కిరెడ్డిపాలెం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. కాగా సోమవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరగనున్నాయి.

సొంత గనులు కేటాయిస్తేనే స్టీల్‌ప్లాంట్‌కు పురోభివృద్ధి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు మంత్రి రాజశేఖర్


దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం, డిసెంబరు 31: స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తేనే పురోభివృద్ధి సాధిస్తుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు మంత్రి రాజశేఖర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1053వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రజా ఉద్యమాలు మరింత బలోపేతం కావాలన్నారు. కార్మికుల ఐక్య పోరాటాలతోనే విజయాలు వరిస్తాయన్నారు. ఉత్తరాంధ్రకు కల్పతరువైన ప్రభుత్వ రంగ సంస్థను ప్రైవేటీకరణ చేయాలన్న దుర్బుద్ధి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి కలగడం శోచనీయమన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఉద్యమంతో ప్రతిఘటిస్తామన్నారు. మన దేశ సహజ సంపదమీద విదేశీ పెట్టుబడిదారులు పెత్తనాన్ని తిప్పికొట్టేందుకు అందరూ ఐక్యంతో చేస్తున్న పోరాటాలు ఢిల్లీకి చేరాలన్నారు. నాయకుడు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగాలు దేశానికి సైనికుల్లాంటివని, వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఆత్మవిశ్వాసంతో చేసే పోరాటాల్లో కార్మికులదే అంతిమ విజయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జె.అయోధ్యరామ్, మస్తానప్ప, జె.రామకృష్ణ, కె.పరంధామయ్య, కేఎస్ఎన్ రావు, గంగవరం గోపి, విప్రసాద్ , తదితరులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షల కార్యాచరణ

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన రిలే నిరాహారదీక్ష ఉద్యమ కార్యాచరణను ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆదివారం ప్రకటించారు. జనవరి ఒకటిన ట్రాఫిక్, కనస్ట్రక్షన్స్, ఆర్ఎండీ, రెండున ఎస్ఎంఎస్-2, మూడున ఎల్ఎంఎంఎం, ఎస్‌బీఎం, నాలుగున ఎఫ్ఎండీ, ఈఎండీ, ఈఎస్ఎండీ, ప్లాంట్ డిజైన్, ఐదున డబ్ల్యూఆర్ఎం, ఎంఎంఎస్ఎం, ఎస్‌టీఎం, ఆరున ఎంఎంఎస్ఎం, ఎస్‌టీఎం, ఏడున కాంట్రాక్టు కార్మికులు (సీఐటీయూ), ఎనిమిదిన ఎస్ఎంఎస్-1, తొమ్మిదిన సీఎంఎం, సీఆర్ఎంపీ, సీఎంఈ, సీఈడీ, ల్యాబ్ అండ్ హైడ్రా, పదిన కోకో ఓవేన్ కార్మికులు దీక్షల్లో కూర్చుంటారని తెలిపారు. 11వ తేదీన సింటర్ ప్లాంట్ కార్మికులు, 12న బ్లాస్ట్‌ఫర్నేస్, 13న ఎస్ఎంఎస్-2, 14న కాంట్రాక్టు కార్మికులు (వైఎస్సార్‌టీయూసీ), 15న ఆర్ఎంహెచ్‌పీ, ఎసీఎస్, హెచ్ఆర్, 16న ఎల్ఎంఎంఎం, ఎస్‌బీఎం, 17న ట్రాఫిక్, కనస్ట్రక్షన్స్, ఆర్ఎండీ, 18న ఓబీసీ అసోసియేషన్, 19న ఎంఎంఎస్ఎం, ఎస్‌టీఎం, 20న ఇన్‌స్ట్రుమెంటేషన్, క్యూఏటీడీ, డీఎన్‌డబ్ల్యూ, ఆర్అండ్‌డీ, డీఅండ్ఈ, టెలికాం, ఈటీఎల్, డీఎన్‌డబ్ల్యూ కార్మికులు దీక్షా శిబిరంలో కూర్చుంటారన్నారు. 21వ తేదీన ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, 22న ఈఎస్అండ్ఎఫ్, ఆర్ఎస్అండ్ ఆర్ఎస్, ఈఆర్ఎస్, భద్రత, టెక్‌సెల్, ఎస్ఎస్‌డీ, ఆగ్రో, 23 ఎస్ఎంఎస్-1, 24న డబ్ల్యూఎండీ, యుటిలిటీస్, అడ్మిన్, టౌన్ అడ్మిన్, టీటీఐ, 25న టీపీపీ, ఆర్ఈడీ, పీఈఎం, స్టోర్స్ ఎస్ఎండీ, 26న సింటర్ ప్లాంట్, 27న కోకో-ఓవేన్, 28న కాంట్రాక్టు కార్మికులు, 29న బ్లాస్ట్ ఫర్నేస్, 30న ఆర్ఎంహెచ్‌పీ, ఏసీఎస్, హెచ్ఆర్, 31న ఎస్ఎంఎస్-2 ఉద్యోగులు రిలే దీక్షల్లో కూర్చోనున్నారు.

కంపుకొడుతున్న పారిశ్రామిక ప్రాంతం

పేరుకుపోతున్న చెత్తకుప్పలు
తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు


గాజువాక కణితి రోడ్డులో పేరుకుపోయిన చెత్త

గాజువాక, డిసెంబరు 31: జీవీఎంసీ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు సమ్మెబాట పట్టడంతో పారిశ్రామిక ప్రాంతం కంపు కొడుతోంది. ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు పెద్దఎత్తున పేరుకుపోవడంతో భరించలేని దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు కూడళ్లలోని డంపర్ బిన్‌లు నిండిపోవడంతో స్థానికులంతా తమ ఇళ్లలోని చెత్తాచెదారాన్ని బయటే వేసేస్తున్నారు. ఆయా చెత్త కుప్పలను కుక్కలు, పందులు, పశువులు చిందరవందర చేస్తూ పరిసరాలను మరింత అధ్వానంగా మారుస్తున్నాయి. గాజువాకలో ఏ వీధిలో అయినా, ప్రధాన మార్గంలో అయినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. కాగా జోనల్ పరిధిలో ఉన్న సుమారు 150 మంది పర్మినెంట్ పారిశుధ్య కార్మికులు విధుల్లో పాల్గొంటూ చెత్తాచెదారాన్ని తరలిస్తున్నా పూర్తి స్థాయిలో ప్రయోజనం ఉండడం లేదు. వీరు ప్రధాన మార్గంతో పాటు కీలక జంక్షన్‌లలో పేరుకుపోయిన చెత్తను మాత్రమే తొలగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.


పారిశుధ్య సిబ్బందిని పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

కాంట్రాక్టు పారిశుధ్య సిబ్బందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

అక్కిరెడ్డిపాలెం: తమ సమస్యలను పరిష్కరించేంత వరకు కాలనీల్లో చెత్తను తరలించవద్దంటూ జీవీఎంసీ వాహనాన్నా అడ్డుకున్న కాంట్రాక్టు పారిశుధ్య సిబ్బందిని షీలానగర్ వద్ద గాజువాక పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఉదయం ఆరు గంటలకు షీలానగర్ జంక్షన్ వద్ద చెత్త తొలగించేందుకు వచ్చిన వ్యాన్‌ను 69వ వార్డుకు చెందిన కాంట్రాక్టు పారిశుధ్య సిబ్బంది అడ్డుకున్నారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు చెత్త తొలగించవద్దని, అప్పటివరకు తమకు సహకరించాలని కోరారు. చెత్తను తొలగించకపోతే ప్రజలు ఇబ్బందులు పడతారని, చెత్త తరలింపునకు ఏర్పాటు చేసిన సిబ్బందికి సహకరించాలని జోనల్ కమీషనర్ పి.సింహచలం, ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్‌లు కాంట్రాక్టు పారిశుధ్య సిబ్బందికి సూచించారు. అయితే అందుకు వారు అంగీకరించకపోవడంతో గాజువాక పోలీసులకు జెడ్‌సి సమాచారం అందజేశారు. ఈ మేరకు పోలీసులు షీలానగర్ కూడలికి చేరుకుని కాంట్రాక్టు పారిశుధ్య సిబ్బందిని అదుపులోకి తీసుకుని వ్యాన్‌లో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం సొంత పూచీకత్తులపై వారిని విడిచిపెట్టారు. పోలీసులు తమను అరెస్టు చేసినా తాము సమ్మె విరమించేది లేదని కాంట్రాక్టు పారిశుధ్య సిబ్బంది స్పష్టం చేశారు.

పవన్‌కల్యాణ్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు


కార్యక్రమంలో మాట్లాడుతున్న కోన తాతారావు

కూర్మన్నపాలెం, డిసెంబరు 31: జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆశయ సాధన కోసం అందరూ కృషి చేద్దామని ఆ పార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావు అన్నారు. 87వ వార్డు పరిధి వడ్లపూడిలో పార్టీ వార్డు అధ్యక్షుడు సిరసపల్లి కనకరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైసీపీ పాలనతో ప్రజలు భీతిల్లిపోతున్నారని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించాలన్నారు. టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టో పట్ల ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి మాట్లాడుతూ యువతకు ఉజ్వల భవిష్యత్తు కావాలంటే వైసీపీ పాలనకు చరమగీతం పాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జ్యోతిరెడ్డి, కాద శ్రీను, డి.సూరి అప్పారావు, శేష, సోమశేఖర్, నర్సింగ్, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

క్రేన్ ఆపరేటర్లను కార్మికులుగా గుర్తించాలి

గాజువాక: క్రేన్ ఆపరేటర్‌లను కార్మికులుగా గుర్తించి కార్మిక చట్టాలు అమలు జరిగేలా చూడాలని కోరుతూ ఉత్తరాంధర క్రేన్ ఆపరేటర్ల అసోసియేషన్ సభ్యులు ఆదివారం జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావుకు గాజువాకలో వినతిపత్రం అందజేశారు. ఆపరేటర్లకు ఈఎస్ఐ, పీఎఫ్ వర్తించేలా చూడాలని, పిల్లలకు విద్య వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. ఆయా సమస్యలను జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లాలని వేడుకున్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ సభ్యులు రవికుమార్, జోగారావు, అర్జున్, తదితరులు ఉన్నారు.

'ప్రాచీన కళలను ప్రోత్సహిద్దాం'


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కార్మిక నేత కేఎస్ఎన్ రావు, తదితరులు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 31: ప్రాచీన చేనేత, హస్తకళలను ప్రోత్సహించాలని ఉక్కు గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కేఎస్ఎన్. రావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ అంబేడ్కర్ కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేటి పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడి నాటి సంప్రదాయాలను మరచిపోతున్నామని, ఎంతో మన్నిక కలిగిన చేనేతను వినియోగించడంతో పాటు వారికి ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ-1 సభ్యులు డి.నరసింగరావు, ఎం.త్రినాథ్, వీఎస్ వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. ముందుగా నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు యువత కృషి చేయాలి: సీఐ శ్రీనివాసరావు


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 31: రోడ్డు ప్రమాదాల నివారణలో యువత కీలక పాత్ర పోషించాలని స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం వాకర్స్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. యువత సన్మార్గంలో నడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న కాలనీ ప్రతినిధులు, చిన్నారులు

కూర్మన్నపాలెం, డిసెంబరు 31: జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమలనగర్‌లో కాలనీవాసులు, చిన్నారులు ఆదివారం ప్లాస్టిక్‌ను నిషేధించాలంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు నాగభూషణం మాట్లాడుతూ ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు విశ్వేశ్వరరావు, పరమేశ్వరరావు, పరమానందం, మూర్తి, సన్యాసిరావు, సన్యాసిరావు, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన వారినుద్దేశించి మాట్లాడుతున్న ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు

పీటీడీ ఉద్యోగులను వేధిస్తే ఆందోళనలు తప్పవు

ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు

పెదగంట్యాడ, డిసెంబరు 31: ప్రజా రవాణాశాఖ (పీటీడీ) ఉద్యోగులను వేధిస్తే ఆందోళనలు తప్పవని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు హెచ్చరించారు. గాజువాక బీసీ రోడ్డులోని ఫంక్షన్ హాల్‌లో అసోసియేషన్ గాజువాక డిపో శాఖ ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనమై పీటీడీగా మారిన తర్వాత అధికారుల్లో మార్పు వచ్చిందని, ప్రతి చిన్న అంశాన్ని భూతద్దంలో చూపిస్తూ ఉద్యోగులపై చర్యలకు ఉపక్రమిస్తున్నారన్నారు. పీటీడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలను చేపడతామన్నారు. 1/2019 సర్క్యులర్‌ను అమలు పరచాలని, అసోసియేషన్ సభ్యులపై అధికారులు చూపిస్తున్న పక్షపాత వైఖరిని విడనాడాలని, డిపో స్పేర్ నుంచి లిస్టు అయిన వారికి అదే డిపోలో పోస్టింగ్ ఇవ్వాలని, ఓటీ, డే అవుట్, నైట్ అలవెన్సులను ప్రతినెలా జీతంతో పాటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి పీవీవీ మోహన్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించినా అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. అసోసియేషన్ డిపో శాఖ అధ్యక్షుడు ఎస్.సంజీవరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పిళ్లా శంకరరావు, జోనల్ కార్యదర్శి ఎంవీఆర్ మూర్తి, ఉపాధ్యక్షుడు సీపీ కుమార్, రీజనల్ కార్యదర్శి బీసీలకంఠం, తదితరులు పాల్గొన్నారు. తొలుత కేక్ కట్ చేసి కొత్త సంవత్సర వేడుకలు జరుపుకున్నారు.

ఆలయ నిర్మాణానికి కరణంరెడ్డి ఆర్థిక సహాయం అందజేత


నగదు అందజేస్తున్న కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, డిసెంబరు 31: జీవీఎంసీ 74వ వార్డు దళ్లివానిపాలెంలోని నూతనంగా నిర్మిస్తున్న నూకాంబిక ఆలయానికి బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కాపాడేందుకు నిర్మిస్తున్న ఆలయానికి తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో లక్కరాజు సోంబాబు, గొందేశి సత్యారావు, పైడికొండ, అప్పారావు, భారతి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు కేంద్రం

అగనంపూడి: జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వేపచెట్టు జంక్షన్ వద్ద ఓటర్ల నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ వార్డు అధ్యక్షుడు మేడిశెట్టి విజయ్ పాల్గొని ఈ కేంద్రాన్ని ప్రారంభించారు.

సీఎం జగన్ అసమర్థత వల్లే ఉక్కు ప్రైవేటీకరణ

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు


కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

గాజువాక, డిసెంబరు 31: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అసమర్థత వల్లే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియ జరుగుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. 74వ వార్డులోని పలు ఉక్కు నిర్వాసిత కుటుంబాలు ఆదివారం టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై జగన్ ఏ మాత్రం పోరాటం చేయడం లేదన్నారు. ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకునేందుకు తాము ఎలాంటి పోరాటాలకైనా సిద్ధమన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు బొండా జగన్, పల్లా శ్రీనివాస్, గంధం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అమలు కాని హామీలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

పెదగంట్యాడ: ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రజలకిచ్చిన హామీల్లో 85 శాతం అమలు కాలేదని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి అన్నారు. పెదగంట్యాడలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమలు కాని హామీల జాబితాను ప్రతి ఇంటికి చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, నాయకులు నమ్మి అప్పారావు, డి.పెరుమాళ్లు, ఎం.పెంటయ్య ఎ.రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ పెరుగుదలపై మొండి వైఖరి తగదు

అగనంపూడి, డిసెంబరు 31: పెన్షన్ పెరుగుదలపై కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరిని అవలంభిస్తోందని ఐఎన్టీయూసీ నాయకుడు మరిశా రామచంద్రరరావు అన్నారు. స్థానిక సీడబ్ల్యూసీలో ఆదివారం విశ్రాంతి ఉద్యోగుల ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం పెరిగిన పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలకు అనుగుణంగా పెన్షన్ పెంపు జరగకపోవడం దారుణమన్నారు. ఈ కారణంగా ఎన్నో ఏళ్ల ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పింఛన్‌దారుల సంఘం ప్రతినిధులు గుదే సుశీల గజేంద్రరావు, బలిరెడ్డి సత్యనారాయణ, బాబూరావు, డొక్కా రమేశ్, విందుల రామునాయుడు, ఎ.అప్పలనాయుడు, విందుల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **డెవిల్ :** జగదాంబ, వెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **బబుల్ గమ్ :** శరత్, రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **సలార్ :** మెలోడి, సంగం, శారద, శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత(శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **పిండం :** మోహిని (గాజువాక)
- **ఆక్వామెన్ :** సుకన్య(గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **హాయ్ నాన్న :** మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), గణేష్ (తగరపువలస),

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 24, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 62, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 54, బీరకాయలు 58, ఆనపకాయ 32, కాలీఫ్లవర్ 28, క్యాబేజ్ 20, క్యారెట్ 40, దొండకాయలు 52, బంగాళదుంపలు 18, అరటికాయ (పెద్దది)7, అల్లం (పాతది) 100, మునక్కాడలు (కిలో) 84, బరబాటి 52, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 50, గోరుచిక్కుడు 44, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 220, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 84, పొటల్స్ 54, కీరదోస 24, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 15, చేమదుంపలు 54, చిలగడదుంపలు 24, కంద 50, దేముడుచిక్కుడు 60, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	100
ఫారం ధర	--	120
విత్ స్కిన్	--	210
స్కిన్‌లెస్	--	220

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 9లో..

పాత పెందుర్తి పాఠశాలలో 'పది' ప్రణాళికకు మంగళం!


తాళం వేసి ఉన్న పాత పెందుర్తిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల

ఆదివారం పాఠశాలకు తాళం వేసి ఉండడంతో డీఈవో దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లిన విద్యా కమిటీ చైర్మన్

టెన్త్ యాక్షన్ ప్లాన్ పక్కాగా అమలయ్యేలా చూస్తామన్న డీఈవో

పెందుర్తి, డిసెంబరు 31: విద్యార్థి దశలో పదో తరగతి అత్యంత కీలకమైంది. పదో తరగతిలో విద్యార్థులు సాధించే మార్కులు వారి భవిష్యత్తుకు పటిష్ఠ పునాదులు వేస్తాయని చెప్పవచ్చు. గత ఏడాది అత్యల్ప ఉత్తీర్ణత శాతాన్ని సాధించడాన్ని దృష్టిలో పెట్టుకుని మండలంలోని ఉన్నత పాఠశాలల్లో ఈ ఏడాది విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేలా విద్యాశాఖ కసరత్తు చేసింది. మార్చి నెలలో జరగనున్న పదో తరగతి పరీక్షలకు సమయాన్ని వృథా చేయకుండా టెన్త్ విద్యార్థులకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను పక్కాగా అమలు చేసేందుకు రంగం సిద్ధం చేశారు.

అయితే మండల విద్యాశాఖ పరిధిలో కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వంద రోజుల ప్రణాళికకు ఉపాధ్యాయులు మంగళం పాడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాత పెందుర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక అమలుకు దూరం అవుతున్నారని పలువురు తలిదండ్రులు ఆరోపిస్తున్నారు. డిసెంబరు 18 నుంచి ప్రారంభమైన వంద రోజుల యాక్షన్ ప్లాన్ మార్చి 26వ తేదీ వరకు కొనసాగాలి. ఇందులో భాగంగా రెండు పూటలా అదనపు తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. ఆదివారమైన, సెలవు రోజుల్లో సైతం టెన్త్ హండ్రెడ్ డేస్ ప్లానింగ్ పక్కాగా జరగాల్సి ఉండగా ఇక్కడి ఉపాధ్యాయుల నిర్వాకంతో పది ప్రణాళికకు మంగళం పలికారని పాఠశాల విద్యా కమిటీ తెలిపింది. ఈ క్రమంలో ఆదివారం కమిటీ చైర్మన్ దాడి నూకరాజు టెన్త్ ప్రణాళిక నిర్వహణ ఎలా ఉందో తెలుసుకునేందుకు పాఠశాలను సందర్శించగా స్కూల్ గేటుకు తాళం వేసి ఉంది. దీంతో ఆయన ఈ విషయాన్ని డీఈవో చంద్రకళ దృష్టికి ఫోన్ ద్వారా తీసుకువెళ్లారు. పదో తరగతి వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఇక్కడ విద్యార్థులకు విద్యా బోధన జరగడం లేదని వివరించారు. టెన్త్ యాక్షన్ ప్లాన్ పక్కాగా అమలయ్యేలా చూస్తామని డీఈవో చెప్పినట్టు నూకరాజు తెలిపారు.

కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో గోదాదేవి అమ్మవారు

వేపగుంట, డిసెంబరు 31: నాయుడుతోట సమీపంలోని రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కళ్యాణ వేంకటేశ్వరాలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం నాలుగు గంటలకు స్వామివారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఉత్సవమూర్తిని గోదాదేవిగా అలకరించి పట్టుచీరతో శోభాయమానంగా అలంకరించారు. అలాగే భరత్ నగర్ సమీపంలోని శ్రీలక్ష్మీనరసింహనగర్‌లో ఉన్న శ్రీగోపిజనవల్లభస్వామి ఆలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని భక్తులు దీపారాధన చేశారు. పరిసర ప్రాంతాలకు చెందదిన భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన


ఉభయ దేవేరులతో సింహాచలేశుడు

సింహాచలం, డిసెంబరు 31 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠంపజేశారు. భక్తుల గోత్ర నామాలతో అర్చకులు సంకల్పించి విశ్వక్సేనారాధన,పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నృసింహ అష్టోత్తర శత నామావళి (108) పఠిస్తూ ప్రతి నామానికి ఒకటి చొప్పున స్వర్ణ పుష్పం తో అర్చన చేశారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో స్వామివారి నిత్య కల్యాణం నిర్వహించారు.మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

14న గోదారంగనాథుల కల్యాణం

వరాహలక్ష్మీనృసింహస్వామి కొండదిగువ పూదోటలో కొలువై ఉన్న పద్మావతి, అలిమంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల ముగింపు పురస్కరించుకుని ఈనెల 14న గోదా రంగనాథుల కల్యాణం నిర్వహించనున్నట్టు ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి తెలిపారు. కల్యాణంలో పాల్గొనే భక్తులు సోమవారం నుంచి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో రూ.1000 చెల్లించి టికెట్లు కొనుగోలు చేసుకోవచ్చునని చెప్పారు. అలాగే నృసింహస్వామి ఆవిర్భా నక్షత్రం పురస్కరించుకుని ఈనెల 6న అప్పన్న సన్నిధిలో ఉదయం 7 గంటల రెండు గంటల పాటు స్వాతి నక్షత్ర హవనం జరుగుతుందన్నారు.

బైబిల్ మిషన్‌లో ప్రత్యేక ప్రార్థనలు


కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

వేపగుంట, డిసెంబరు 31: ఇక్కడి జీవీఎంసీ కమ్యూనిటీ హాల్‌లో కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని వేపగుంట బైబిల్ మిషన్ సమృద్ధి గృహ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉదయం, సాయంత్రం జరిపిన ప్రార్థనల్లో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రెవరెండ్ ఫాదర్ సీహెచ్ సుందరరావు ఏసుక్రీస్తు సందేశంతో పాటు కొత్త సంవత్సరంలో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డానిష్, రాము, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.


బైక్ ర్యాలీలో పాల్గొన్న నాయకులు, జనసైనికులు

జనసైనికుల బైక్ ర్యాలీ

సింధియా, డిసెంబరు 31: జనసేన పార్టీ 63వ వార్డు అధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానికంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. సుమారు 150 మంది యువకులు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పశ్చిమ నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త అంగ దుర్గాప్రశాంతి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థుల విజయం తథ్యమన్నారు. ముందుగా ఆమె పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గత ఏడాది 98 గంజాయి కేసులు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 31 : గత ఏడాది టాస్క్‌ఫోర్స్ పోలీసులు 98 గంజాయి కేసులు నమోదు చేయడంతో పాటు 250 మంది స్మగ్లర్లను అరెస్టు చేసినట్టు ఏసీపీ త్రినాథ రావు ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 48.52 లక్షల విలువైన 2,426 కిలోల గంజాయి, రూ. 9.50 లక్షలు విలువ చేసే 19 కిలోల గంజాయి ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. రూ. 63,290 వేల నగదు కూడా స్వాధీనం చేసుకు న్నామన్నారు.

చెట్టును ఢీకొన్న కారు

సాగర్‌నగర్, డిసెంబరు 31 : బీచ్‌రోడ్డులోని రాడిసన్ బ్లూ హోటల్ వద్ద ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో భీమునిపట్నం నుంచి నగరానికి వెళ్తున్న కారు చెట్టును ఢీకొంది. దీంతో ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ప్రమాద సమయంలో కారులో నలుగురు వ్యక్తులు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. కారులోని సెఫ్టీ బెలూన్స్ తెరుచుకోవడంతో పాటు చెట్టు పరిసర ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా నాలుగు నెలలు కిందట ఇదే ప్రాంతంలో కారు ప్రమాదం జరగడంతో నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. మళ్లీ అదే చోట ప్రమాదం జరగడంతో స్థానికులు భయపడుతున్నారు.

రాజకీయాల్లో ప్రభుత్వ ఉద్యోగులూ కీలకం

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 31: రాజకీయాల్లో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర చాలా కీలకమని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శివాజీపార్కులో శనివారం యాదవ ఎంప్లాయీస్ సొసైటీ నిర్వహించిన వన భోజన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ఇబ్బంది పడితే ప్రభుత్వాలు మారిపోయే పరిస్థితి ఉంటుందన్నారు. ఒక్క ఉద్యోగిని ఇబ్బంది పెడితే, వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కూడా ఆ ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తం చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నేతలు పాల్గొన్నారు.

వంశీని కలిసిన టీడీపీ నాయకులు

మద్దిలపాలెం, డిసెంబరు 31 : శివాజీపాలెంలో ఎమ్మెల్సీ వంశీకృష్ణశ్రీనివాస్‌ను ఆయన నివాసంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ, 22వ వార్డు నాయకులు ఆది వారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వారు వార్డులో టీడీపీ, జనసేన చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దువ్వి స్వామి, ఒమ్మి అప్పా రావు, డొక్కర శ్రీను, పడాల డేవిడ్, పైడి రాజు, అప్పారావు, దేవర రఘు, గుణలక్ష్మీ, జయమ్మ పాల్గొన్నారు. అలాగే జనసేన పార్టీ 21వ వార్డు అధ్యక్షురాలు గుమ్మడి నందితా రావు కూడా వంశీకృష్ణను కలిసి, ఘనంగా సత్కరించారు.

శ్రీవారికి లక్ష చామంతులతో పుష్పార్చన



అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 31: బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల వేంకటేశ్వర వినాయకస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీవారికి అర్చకులు లక్ష చామంతులతో పుష్పార్చన చేశారు. కన్నులపండువగా సాగిన పుష్పార్చన భక్తులను పరవశులను చేసింది. ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మణాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు ముందుగా స్వామివారిని పంచామృతాలతో అభిషేకించాక ప్రత్యేక పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం వేదపండితులు భక్తులచే లక్ష చామంతులతో పుష్పార్చన చేయించి, ప్రత్యేక పూజలు చేశారు. పూజాది కార్యక్రమాల్లో దేవస్థానం పాలక మండలి చైర్మన్ గండ్రెడ్డి రామునాయుడు, సభ్యులతో పాటు బీహెచ్‌పీవీ, మిండి, అక్కిరెడ్డిపాలెం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. కాగా సోమవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరగనున్నాయి.


సమావేశానికి హాజరైన వారినుద్దేశించి మాట్లాడుతున్న ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు

పీటీడీ ఉద్యోగులను వేధిస్తే ఆందోళనలు తప్పవు

ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు

ద్వారకా బస్‌స్టేషన్, డిసెంబరు 31: ప్రజా రవాణాశాఖ (పీటీడీ) ఉద్యోగులను వేధిస్తే ఆందోళనలు తప్పవని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు హెచ్చరించారు. గాజువాక బీసీ రోడ్డులోని ఫంక్షన్ హాల్‌లో అసోసియేషన్ గాజువాక డిపో శాఖ ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనమై పీటీడీగా మారిన తర్వాత అధికారుల్లో మార్పు వచ్చిందని, ప్రతి చిన్న అంశాన్ని భూతద్దంలో చూపిస్తూ ఉద్యోగులపై చర్యలకు ఉపక్రమిస్తున్నారన్నారు. పీటీడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలను చేపడతామన్నారు. 1/2019 సర్క్యులర్‌ను అమలు పరచాలని, అసోసియేషన్ సభ్యులపై అధికారులు చూపిస్తున్న పక్షపాత వైఖరిని విడనాడాలని, డిపో స్పేర్ నుంచి లిస్టు అయిన వారికి అదే డిపోలో పోస్టింగ్ ఇవ్వాలని, ఓటీ, డే అవుట్, నైట్ అలవెన్సులను ప్రతినెలా జీతంతో పాటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి పీవీవీ మోహన్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించినా అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. అసోసియేషన్ డిపో శాఖ అధ్యక్షుడు ఎస్.సంజీవరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పిళ్లా శంకరరావు, జోనల్ కార్యదర్శి ఎంవీఆర్ మూర్తి, ఉపాధ్యక్షుడు సీపీ కుమార్, రీజనల్ కార్యదర్శి బీసీలకంఠం, తదితరులు పాల్గొన్నారు. తొలుత కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు.

7న బీజేపీ బీసీ సామాజిక చైతన్య సభ

ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్

విశాఖపట్నం, డిసెంబరు 31: వైసీపీ ప్రభుత్వం బీసీ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 7న ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా కళాశాల మైదానంలో బీసీ సామాజిక చైతన్య సభ నిర్వహించనున్నట్టు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.జగన్ ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేసిందన్నారు. ఎన్నికల్లో ఎన్నో హామీలిచ్చి వాటిని తుంగలో తొక్కారని విమర్శించారు. జీరో బీసీ బడ్జెట్‌తో పాలన చేసిన ఏకైక ప్రభుత్వం వైసీపీ అన్నారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా ఒక్క కార్పొరేషన్‌కు కూడా నిధులు ఇవ్వకుండా బీసీ సమాజాన్ని అవమానించారన్నారు. రాయితీ రుణాలు నిలిపివేసి, బీసీ విద్యార్థులకు విదేశీ విద్య రుణాలు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. ఈ నేపథ్యంలో బీసీ విద్యార్థుల్ని, యువతను ఏకతాటిపైకి తీసుకు వచ్చేందుకే బీసీ సామాజిక చైతన్య సభ నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం బీసీ చైతన్య సభ పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఆయనతో పాటు బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లి శ్రీనివాస్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ దోపిడీ

గంగవరంలో ఇష్టారాజ్యంగా అక్రమ తవ్వకాలు

జగనన్న కాలనీ లే-అవుట్ అవసరాల మాటున గ్రావెల్ దందా

రాత్రిపూట యంత్రాలతో తవ్వకాలు, ఇతర ప్రదేశాలకు రవాణా

స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు


గంగవరంలో జగనన్న కాలనీకి ఆనుకొని ఉన్న కొండవాలు ప్రాంతంలో గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన భారీ గోతులు

సబ్బవరం, డిసెంబరు 31: మండలంలోని గంగవరంలో (జీవీఎంసీ 88వ వార్డు) జగనన్న ఇళ్ల కాలనీల అవసరాల మాటున గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. అర్ధరాత్రి దాటిన తరువాత నుంచి తెల్లవారుజాము వరకు ఎక్స్‌కవేటర్లతో గ్రావెల్ తవ్వి, డంపర్ లారీల్లో తరలిస్తున్నారు. గ్రావెల్‌ను కొత్తూరు, వెదుళ్లనరవ, అజనగిరి, దువ్వాడ తదితర ప్రాంతాల్లోని ప్రైవేటు ఖాళీ స్థలాల్లో నిల్వ చేస్తున్నారు. ఇక్కడి నుంచి గాజువాక, దువ్వాడ, అగనంపూడి, లంకెలపాలెం, తదితర ప్రాంతాల్లోని లే-అవుట్లు, ల్యాండ్ ఫిల్లింగ్‌కు తరలిస్తున్నారు. దూరాన్నిబట్టి ఒక్కో లారీ గ్రావెల్‌ను రూ.5 వేల నుంచి రూ.8 వేలకు విక్రయిస్తున్నారు.

విశాఖ నగరం సొంత ఇల్లు లేని పేదల కోసం సబ్బరవం మండలం గంగవరంలో కొండవాలు ప్రాంతంలో భారీ లేఅవుట్ వేసి, స్థలాల పట్టాలు పంపిణీ చేసిన విషయం తెలిసింది. ఈ లేవుట్‌లో రోడ్ల నిర్మాణంతోపాటు ఇళ్ల పునాదుల ఫిల్లింగ్ కోసం గ్రావెల్ అవసరం ఏర్పడింది. దీంతో ప్రభుత్వం మైనింగ్, రెవెన్యూ శాఖల అనుమతితో సంబంధిత కాంట్రాక్టర్.. ఇళ్ల స్థలాల లేవుట్‌కు సమీపంలోని కొండవాలు ప్రదేశంలో గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. దీంతో కొంత మంది అక్రమార్కుల కన్ను ఈ గ్రావెల్ తవ్వకాలు జరిపే ప్రదేశంపై పడింది. ఎవరికీ అనుమానం రాకుండా రాత్రిపూట ఎక్స్‌కవేటర్లతో భారీగా గ్రావెల్ తవ్వి తరలించుకుపోతున్నారు. ఇక్కడి నుంచి నేరుగా గాజువాక, దువ్వాడ, అగనం పూడి, లంకెలపాలెం, గోపాలపట్నం తదితర ప్రాం తాల్లో ప్రైవేటు లే-అవుట్లు, ల్యాండ్ ఫిల్లింగ్‌కు తరలిస్తున్నారు. టిప్పర్ గ్రావెల్ రూ.5 వేల నుంచి రూ.8 వేలకు అమ్ముకుంటున్నారు. గ్రావెల్‌కు ఆర్డర్లు లేకపోతే కొత్తూరు, వెదుళ్లనరవ, అజనగిరి, దువ్వాడ తదితర ప్రాంతాల్లో ప్రైవేటు స్థలాల్లో నిల్వ చేస్తున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

గంగవరంలో అక్రమంగా జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలపై మైనింగ్, విజిలెన్స్, రెవెన్యూ అధికారులకు ఫోన్ చేసి సమాచారం ఇస్తున్నామని, దాడులు చేసి అక్రమార్కులను పట్టుకోకపోగా, సమాచారం ఇచ్చిన తమపైనే చిందులేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంగవరం గ్రామానికి చెందిన వార్డు వలంటీరు ఒకరు గ్రావెల్ తవ్వకాలు, రవాణాలో చక్రం తిప్పుతున్నట్టు స్థానికంగా ప్రచారం జరుగుతున్నది. ఇతనితోపాటు మరో ఎనిమిది మందిపై రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని, పోలీసులు కూడా కేసులు నమోదు చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు.

సొంత గనులు కేటాయిస్తేనే స్టీల్‌ప్లాంట్ పురోభివృద్ధి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు మంత్రి రాజశేఖర్


దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం, డిసెంబరు 31: స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తేనే పురోభివృద్ధి సాధిస్తుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు మంత్రి రాజశేఖర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1053వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రజా ఉద్యమాలు మరింత బలోపేతం కావాలన్నారు. కార్మికుల ఐక్య పోరాటాలతోనే విజయాలు వరిస్తాయన్నారు. ఉత్తరాంధ్రకు కల్పతరువైన ప్రభుత్వ రంగ సంస్థను ప్రైవేటీకరణ చేయాలన్న దుర్బుద్ధి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి కలగడం శోచనీయమన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఉద్యమంతో ప్రతిఘటిస్తామన్నారు. మన దేశ సహజ సంపద మీద విదేశీ పెట్టుబడిదారులు పెత్తనాన్ని తిప్పికొట్టేందుకు అందరూ ఐక్యంతో చేస్తున్న పోరాటాలు ఢిల్లీకి చేరాలన్నారు. నాయకుడు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగాలు దేశానికి సైనికుల్లాంటివని, వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఆత్మవిశ్వాసంతో చేసే పోరాటాల్లో కార్మికులదే అంతిమ విజయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జె.అయోధ్యరామ్, వై.మస్తానప్పు, జె.రామకృష్ణ, కె.పరంధామయ్య, కేఎస్ఎన్ రావు, గంగవరం గోపి, వి.ప్రసాద్ , తదితరులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షల కార్యాచరణ

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన రిలే నిరాహారదీక్ష ఉద్యమ కార్యాచరణను ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆదివారం ప్రకటించారు. జనవరి ఒకటిన ట్రాఫిక్, కనస్ట్రక్షన్స్, ఆర్ఎండీ, రెండున ఎస్ఎంఎస్-2, మూడున ఎల్ఎంఎంఎం, ఎస్‌బీఎం, నాలు గున ఎఫ్ఎండీ,ఈఎండీ, ఈఎస్ఎండీ, ప్లాంట్ డిజైన్,ఐదున డబ్ల్యూఆర్ఎం, ఎంఎంఎస్ఎం, ఎస్‌టీఎం, ఆరున ఎంఎంఎస్ఎం, ఎస్‌టీఎం, ఏడున కాంట్రాక్టు కార్మికులు (సీఐటీయూ), ఎనిమిదిన ఎస్ఎంఎస్-1, తొమ్మిదిన సీఎంఎం, సీఆర్ఎంపీ, సీఎంఈ, సీఈడీ, ల్యాబ్ అండ్ హైడ్రా, పదిన కోకో ఓవేన్ కార్మికులు దీక్షల్లో కూర్చుంటారని తెలిపారు. 11వ తేదీన సింటర్ ప్లాంట్ కార్మికులు, 12న బ్లాస్ట్ ఫర్నేస్, 13న ఎస్ఎంఎస్-2, 14న కాంట్రాక్టు కార్మికులు (వైస్సార్‌టీయూసీ), 15న ఆర్ఎంహెచ్‌పీ, ఎస్ఏస్, హెచ్‌ఆర్, 16న ఎల్ఎంఎంఎం, ఎస్‌బీఎం, 17న ట్రాఫిక్, కనస్ట్రక్షన్స్, ఆర్ఎండీ, 18న ఓబీసీ అసోసియేషన్, 19న ఎంఎంఎస్ఎం, ఎస్‌టీఎం, 20న ఇన్‌స్ట్రుమెంటేషన్, క్యూఏటీడీ, డీఎస్‌డబ్ల్యూ, ఆర్‌అండ్‌డీ, డీఅండ్‌ఈ, టెలికాం, ఈటీఎల్, డీఎన్‌డబ్ల్యూ కార్మికులు దీక్షా శిబిరంలో కూర్చుంటారన్నారు. 21వ తేదీన ఎస్సీ ఎస్టీ అసోసియేషన్, 22న ఈఎస్‌అండ్‌ఎఫ్, ఆర్ఎస్‌అండ్‌ఆర్ఎస్, ఈఆర్ఎస్, భద్రత, టెక్‌సెల్, ఎస్ఎస్‌డీ, ఆగ్రో, 23 ఎస్ఎంఎస్-1, 24న డబ్ల్యూఎండీ, యుటిలిటీస్, అడ్మిన్, టౌన్ అడ్మిన్, టీటీఐ, 25న టీపీపీ, ఆర్ఈడీ, పీఈఎం, స్టోర్స్, ఎస్ఎండీ, 26న సింటర్ ప్లాంట్, 27న కోకో-ఓవేన్, 28న కాంట్రాక్టు కార్మికులు, 29న బ్లాస్ట్ ఫర్నేస్, 30న ఆర్ఎంహెచ్‌పీ, ఏసీఎస్, హెచ్‌ఆర్, 31న ఎస్ఎంఎస్-2 ఉద్యోగులు రిలే నిరాహార దీక్షల్లో కూర్చోనున్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

సీఎం జగన్ అసమర్థత వల్లే ఉక్కు ప్రైవేటీకరణ

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, డిసెంబరు 31: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అసమర్థత వల్లే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియ జరుగుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. 74వ వార్డులోని పలు ఉక్కు నిర్వాసిత కుటుంబాలు ఆదివారం టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై జగన్ ఏ మాత్రం పోరాటం చేయడం లేదన్నారు. ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకునేందుకు తాము ఎలాంటి పోరాటాలకైనా సిద్ధమన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు బొండా జగన్, పల్లా శ్రీనివాస్, గంధం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అమలు కాని హామీలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

పెదగంట్యాడ: ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రజలకిచ్చిన హామీల్లో 85 శాతం అమలు కాలేదని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి అన్నారు. పెదగంట్యాడలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమలు కాని హామీల జాబితాను ప్రతి ఇంటికి చేర్చాలని సూచించారు. కార్యకమంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, నాయకులు నమ్మి అప్పారావు, డి.పెరుమాళ్లు, ఎం.పెంటయ్య, ఎ.రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ పెరుగుదలపై మొండి వైఖరి తగదు

ఐఎన్‌టీయూసీ నాయకుడు మరిశా రామచంద్రరరావు

అగనంపూడి, డిసెంబరు 31: పెన్షన్ పెరుగుదలపై కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరిని అవలంభిస్తోందని ఐఎన్‌టీయూసీ నాయకుడు మరిశా రామచంద్రరరావు అన్నారు. స్థానిక సీడబ్ల్యూసీలో ఆదివారం విశ్రాంతి ఉద్యోగుల ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం పెరిగిన పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలకు అనుగుణంగా పెన్షన్ పెంపు జరగకపోవడం దారుణమన్నారు. ఈ కారణంగా ఎన్నో ఏళ్లు ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పింఛన్‌దారుల సంఘం ప్రతినిధులు గుడే సుశీల గజేంద్రరావు, బలిరెడ్డి సత్యనారాయణ, బాబూరావు, డొక్కా రమేశ్, విందుల రామునాయుడు, ఎ.అప్పలనాయుడు, విందుల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


విక్రయానికి సిద్ధంగా ఉన్న పుష్పగుచ్ఛాలు


క్యూలో నిల్చొని బిర్యానీ కొనుగోలు చేస్తున్న ప్రజలు

మార్కెట్‌కు నూతన సంవత్సర శోభ

గోపాలపట్నం, డిసెంబర్ 31: నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో గోపాలపట్నం ప్రధాన రహదారిలోని షాపులన్నీ నూతన శోభను సంతరించుకున్నాయి. పెద్ద పండగ సంక్రాంతి సమీపించడంతో పాటు నూతన సంవత్సర సంబరాల కారణంగా ఆదివారం సాయంత్రం నుంచి బజారులన్నీ కిక్కిరిసిన జనాలతో ఒక్కసారిగా పండగ వాతావరణం నెలకొంది. న్యూ ఇయర్ వేడుకల్లో ముఖ్యమైన కేక్‌లు, స్వీట్లు, పండ్లు, బొకేలు విక్రయించే దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ప్రధాన రహదారిలోని బేకరీలు, స్వీటు షాపులన్నీ కొనుగోలుదారులతో రద్దీగా దర్శనమిచ్చాయి. బొకేలు విక్రయాలు కూడా సాయంత్రం నుంచి జోరందుకున్నాయి. వీటన్నింటికీ ధీటుగా మద్యం విక్రయాలు కూడా మరింత అధికంగా సాగాయి. బార్‌లతో పోలిస్తే ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనే అమ్మకాలు జోరుగా సాగాయి.

నింగినంటిన ధరలు..

కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా పండ్లు, పువ్వులు, బొకేల ధరలకు రెక్కలు వచ్చాయి. వీటికి మంచి డిమాండ్ ఉండడంతో సాధారణ రోజుల్లో కంటే ధరలు కాస్త పెరిగాయి.

కొనుగోలుదారులతో కిటకిటలాడిన బేకరీలు, స్వీట్ షాపులు, పుష్పగుచ్ఛాల దుకాణాలు



బొకేల ధరలు అధికమైనప్పటికీ వీటి అమ్మకాలు ఆశాజనకంగా సాగాయి. ప్రధాన రహదారిలో పండ్లు, పూలు విక్రయించే దుకాణాలు కూడా కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

ఆఫర్లతో జోరుగా అమ్మకాలు

కాగా బిర్యానీ, కేక్‌లు విక్రయించే దుకాణాల్లో ప్రవేశపెట్టిన ఆఫర్లు కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్నాయి. దీంతో వాటి అమ్మకాలు అధికంగా సాగుతున్నాయ. ఆది, సోమవారాల్లోనూ ఈ ఆఫర్లు కొనసాగుతాయని నిర్వాహకులు ప్రకటించారు. సాధారణ రోజుల కంటే తక్కువ ధరలకే బిర్యానీ, కేక్‌లు లభిస్తుండడంతో అత్యధికులు వీటి కొనుగోలుకు ఆసక్తి చూపారు. ఇదిలావుండగా నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలు నడిపే వారితో ఎక్కువగా ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉన్నందున నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లలో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా నిఘా పెట్టారు.

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని శ్రీహరిపురం, మల్కాపురాలలో ఉన్న బేకరీలు, స్వీట్ షాపులు, పూల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పలు షాపుల్లో రాయితీలు ప్రకటించడంతో అమ్మకాలు ఆశాజనకంగా సాగుతున్నాయి. ఉదయం నుంచి అంతంత మాత్రంగా సాగిన అమ్మకాలు ఆదివారం సాయంత్రానికి జోరందుకున్నాయి.

ఘనంగా రిటైర్డు రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న పెన్షనర్లు

వేపగుంట, డిసెంబరు 31: జీవీఎంసీ 98వ వార్డు సింహాచలం సమీపంలోని శ్రీనివాసనగర్ బంగారమ్మతల్లి వృద్ధాశ్రమం పక్కనున్న తోటలో రిటైర్డు రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ వార్షికోత్సవాన్ని ఆదివారం ఉత్సాహభరితంగా నిర్వహించారు. ముందుగా వీరంతా 2023 సంవత్సర మొత్తంలో సాధించిన ప్రగతిపై చర్చించారు. అలాగే రైల్వే పెన్షనర్లకు రైల్వే రిజర్వేషన్ సెంటర్, ఆస్పత్రి ఓపీడీ వద్ద కూర్చొని వేచివుండేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఎంకు వినతిపత్రం ఇవ్వాలని తీర్మానించారు. సభ్యుల్లో ఎవరికైనా ఆరోగ్యం బాగోకపోతే వాట్సాప్, ఫోన్‌లో సభ్యులు సంప్రదిస్తే వెంటనే ఆస్పత్రిలో వైద్య సదుపాయాలు కల్పించేలా, నూతన సంవత్రంలో వెయ్యి మందిని సభ్యులుగా చేర్చుకోవాలని, తదితర తీర్మానాలను అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా అధిక వయసున్న వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎస్‌వీ శేషాద్రి, జీవీ రమణ, ఎస్‌ఆర్‌కే రాజు, వి.నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకుంటున్న శంఖు, చక్ర, నామాలు

వేపగుంట, డిసెంబరు 31: నాయుడుతోట కూడలిలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన శంఖు, చక్ర, నామాలు అందరినీ అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ కూడలిలో నాలుగు నెలల కిందట ఆర్చ్‌ను చేశారు. కాగా వారం రోజులు కిందట ఓ భక్తుని ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన శంఖు, చక్ర, నామాలను ఎల్‌ఈడీ లైట్లతో అలంకరించడం పట్ల భక్తుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి 'కరణంరెడ్డి' ఆర్థిక సాయం అందజేత

గాజువాక, డిసెంబరు 31: జీవీఎంసీ 74వ వార్డు దబ్బివానిపాలెంలోని నూతనంగా నిర్మిస్తున్న నూకాంబిక ఆలయానికి బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కాపాడేందుకు నిర్మిస్తున్న ఆలయానికి తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో లక్కరాజు సోంబాబు, గొందేశి సత్యారావు, పైడికొండ, అప్పారావు, భారతి, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌పైకి దూసుకుపోయిన లారీ

డ్రైవర్‌కు స్వల్ప గాయాలు
నుజ్జునుజ్జయిన వాహనం


గుర్రమ్మపాలెం బైపాస్ రోడ్డులో బోల్తా పడిన లారీ

పెందుర్తి, డిసెంబరు 31: మండలంలోని గుర్రమ్మపాలెం పీఎస్ఎల్ కంపెనీ బైపాస్ రహదారి సమీపంలో ఆదివారం ఓ లారీ డివైడర్‌పైకి దూసుకుపోయి బోల్తా పడింది. సబ్బవరం నుంచి వస్తున్న లారీ ఇక్కడి బైపాస్ రోడ్డు మలుపులో ఒక్కసారిగా అదుపు తప్పడంతో ప్రమాదం చోటుచేసుకుంది. కాగా ప్రమాదాన్ని పసిగట్టిన లారీ డ్రైవర్ కిందకు దూకేయడంతో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో లారీ చక్రాలు ఊడిపోవడంతో పాటు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ట్రాఫిక్ ఎస్ఐ రమేశ్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం వాటిల్లకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

సుదర్శన హోమానికి శారదా పీఠాధిపతికి ఆహ్వానం


శారదా పీఠాధిపతితో వెంకటాద్రి ఆలయ వర్గాలు

పెందుర్తి, డిసెంబరు 31: ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా జనవరి ఏడో తేదీన వెంకటాద్రి శిఖరంపై గల సుదర్శన కల్యాణ మండపంలో జరగనున్న శ్రీసుదర్శన హోమం, కుంకుమ పూజ కార్యక్రమానికి శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిని ప్రత్యేక ఆహ్వానితులుగా ఆలయ వర్గాలు ఆహ్వానించాయి. ఈ మేరకు ఆదివారం చినముషిడివాడలోని శారదా పీఠానికి ఆలయ వర్గాలు వెళ్లి పీఠాధిపతిని కలిసి ఆయన ఆశీసులు తీసుకున్నారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు మహర్షి రామానుజాచార్యులు పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతికి సుదర్శన హోమం ఆహ్వాన పత్రికను అందజేశారు.

నేడు నవనీతంలో అలంకరణ

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం వెంకటాద్రి శిఖరంపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామిని నవనీతం (వెన్న)తో అలంకరించనున్నారు. కాగా ఆదివారం స్వామివారి మూలవిరాట్ విగ్రహానికి ప్రత్యేక అలంకరణలు చేసి విశేష హారతులిచ్చారు. గోదాదేవి అమ్మవారికి విశేష కుంకమార్చన చేశారు. అనంతరం తిరుప్పావై పఠించారు. గోదాదేవి పాశురాన్ని స్వామికి నివేదించారు.

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 24, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 62, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 54, బీరకాయలు 58, ఆనపకాయ 32, కాలీఫ్లవర్ 28, క్యాబేజ్ 20, క్యారెట్ 40, దొండకాయలు 52, బంగాళదుంపలు 18, అరటికాయ (పెద్దది)7, అల్లం (పాతది) 100, మునక్కాడలు (కిలో) 84, బరబాటి 52, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 50, గోరుచిక్కుడు 44, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 220, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 84, పొటల్స్ 54, కీరదోస 24, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 15, చేమదుంపలు 54, చిలగడదుంపలు 24, కంద 50, దేముడుచిక్కుడు 60, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	100
ఫారం ధర	--	120
విత్ స్కిన్	--	210
స్కిన్‌లెస్	--	220

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 9లో..

పవన్‌కల్యాణ్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు


కార్యక్రమంలో మాట్లాడుతున్న కోన తాతారావు

కూర్మన్నపాలెం, డిసెంబరు 31: జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆశయ సాధన కోసం అందరూ కృషి చేద్దామని ఆ పార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావు అన్నారు. 87వ వార్డు పరిధి వడ్లపూడిలో పార్టీ వార్డు అధ్యక్షుడు సిరసపల్లి కనకరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైసీపీ పాలనతో ప్రజలు భీతిల్లిపోతున్నారని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించాలన్నారు. టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టో పట్ల ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి మాట్లాడుతూ యువతకు ఉజ్వల భవిష్యత్తు కావాలంటే వైసీపీ పాలనకు చరమగీతం పాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జ్యోతిరెడ్డి, కాద శ్రీను, డి.నూరి అప్పారావు, శేషు, సోమశేఖర్, నర్సింగ్, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

క్రేన్ ఆపరేటర్లను కార్మికులుగా గుర్తించాలి

గాజువాక: క్రేన్ ఆపరేటర్‌లను కార్మికులుగా గుర్తించి కార్మిక చట్టాలు అమలు జరిగేలా చూడాలని కోరుతూ ఉత్తరాంధ్ర క్రేన్ ఆపరేటర్ల అసోసియేషన్ సభ్యులు ఆదివారం జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావుకు గాజువాకలో వినతిపత్రం అందజేశారు. ఆపరేటర్లకు ఈఎస్ఐ, పీఎఫ్ వర్తించేలా చూడాలని, పిల్లలకు విద్య, వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. అయా సమస్యలను జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లాలని వేడుకున్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ సభ్యులు రవికుమార్, జోగారావు, అర్జున్, తదితరులు ఉన్నారు.